క్లుప్తంగా

బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నీని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఆమనగల్లు: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 12 టీమ్‌లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. దీన్ని మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణనాయక్, ప్రధాన కార్యదర్శి కొౖట మల్లేశ్, సభ్యులు వెంకటేశ్, పర్వతాలు, తిరుపతి, ప్రసాద్, రవి, జంగయ్య, జగన్, గిరి, శివకుమార్, వేణు, దేవేందర్, శ్రీకాంత్, అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతకు సన్మానం



మార్కెట్ చైర్‌పర్సన్ గీతను సత్కరిస్తున్న అనంతరెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన యాట గీతను ఆదివారం ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి ఘనంగా సత్కరించారు. ఆమనగల్లు పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో యాట గీతను జక్కు అనంతరెడ్డి పూల మాల వేసి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



అయ్యప్ప పడి పూజలో భక్తులు, నాయకులు

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో మాజీ ఎంపీటీసీ యాదయ్య, రాఘవేందర్ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వామి మహాపడిపూజ భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కేరళకు చెందిన గురుస్వామి చంద్రమోహన్‌నాయర్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి లక్ష్మారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ విఠలయ్య, మాజీ ఎంపీటీసీ గోపాల్, సాయిలు, బాలకృష్ణ, వెంకటయ్య, భూపతి, నాని, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్



మైసిగండి మైసమ్మను దర్శించుకున్న గీత నర్సింహ దంపతులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవతను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బాలుడు ఆత్మహత్య

తలకొండపల్లి: ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని చంద్రధనలో చోటు చేసుకుంది. స్థానిక పాఠశాలలో పదోతరగతి చదువుతున్న చరణ్ (16) శివారు ప్రాంతంలోని వ్యవసాయ బావి వద్ద పశువుల షెడ్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో చరణ్ తల్లి దండ్రులు కొమురమ్మ, యాదయ్యలు వచ్చి చూసేసరికి అప్పటికే చరణ్ మృతి చెందాడని గ్రహించారు. ఈ విషయం గురించి ఎస్‌ఐని వివరాలు కోరగా తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

విద్యావ్యవస్థ బలోపేతమే లక్ష్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి
- కొనసాగుతున్న ప్రజా పాలన దినోత్సవ సంబురాలు

మాడ్గుల: విద్యావ్యవస్థ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాడ్గుల మండలంలో ప్రజా పాలన దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాదినోత్సవం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు ఆటలు, పునరుత్పాదక ఇంధన వనరుల అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యాభివద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. విద్యార్థులు పదోతరగతిలో మంచి మార్కులు సాధించాలన్నారు. విద్యా ద్వారానే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. పాఠశాలల్లో అస్థిత్వాన్ని నిలబెట్టుకునేందుకు పల్లెల స్థాయిలో పాలకపక్షాలకు కనువిప్పు కలిగే స్థాయిలో తల్లి దండ్రులు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యమన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీబీ మెంబర్ బాలాజీ సింగ్, అభ్యుదయ ఫౌండేషన్ చైర్మన్ సూదిని పద్మారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, ఎంఈఓ సర్దార్ నాయక్, ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ వినోద్ సాగర్, ప్రధానోపాధ్యాయుడు, అధికారులు నాయకులు పాల్గొన్నారు.



కడ్తాల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, పీసీబీ మెంబర్ బాలాజీసింగ్ తదితరులు

పంతు నాయక్ సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే

కడ్తాల్: కాంగ్రెస్ నాయకుడు, ఆమనగల్లు మాజీ ఎంపీపీ, దివంగత రమావత్ పంతునాయక్ ఈ ప్రాంత అభివృద్ధికి, గిరిజనుల సంక్షేమానికి పాటుపడ్డారని, ఆయన చేసిన సేవలు మరువలేనివని, ఆయన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కొనియాడారు. ఆదివారం పంతునాయక్ వర్ధంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ మెంబర్ బాలాజీసింగ్, వివిధ పార్టీల, సంఘాల నాయకులు, కుటుంబసభ్యులు, మైసిగండి గ్రామంలోని పంతునాయక్ విగ్రహాన్ని, ఘాట్‌ను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మైసిగండి ఆలయ అభివృద్ధికి పంతునాయక్ చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఎంపీపీగా, జెడ్పీటీసీ సభ్యుడిగా, గిరిజన నాయకుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. నివాళులర్పించిన వారిలో మైసిగండి ఆలయ ట్రస్టీ శిరోలీ, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ జ్యోతి, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, మార్కెట్ చైర్‌పర్సన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, బీక్యానాయక్, అనంతరెడ్డి, శేఖర్‌గౌడ్, లచ్చిరాంనాయక్, జవహర్, హీరాసింగ్, లాయక్‌అలీ, తులసీరాం, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాడ్గుల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు

ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు కలుగుతుందని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో ఆదివారం కొండేటి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడారు. ప్రస్తుతం వైద్యం ఎంతో ఖరీదైందన్నారు. పేద, మధ్యతరగతి వారికి నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. అనంతరం ఆస్పత్రి యండీ కొండేటి మలయ్య మాట్లాడుతూ ప్రతి శుక్రవారం గైనాకాలజీ, సంతానలేమి ఉచిత ఓపీ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ప్రతి సోమవారం బీపీ, హైపర్‌టెన్షన్, మధుమేహం, షుగర్, థైరాయిడ్‌లకు ఉచితంగా వైద్యం చేయిస్తామన్నారు. అన్ని వైద్య పరీక్షలపై 20 శాతం డిస్కౌంట్ సదుపాయం ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగించుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలు, ఇతర సేవలకు 8919964649, 04027137777, 04027061111 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేందర్, వనం శ్రీనివాస్, ప్రవీణ్‌గౌడ్, దాసుగౌడ్, వైద్యులు డాక్టర్ సౌమ్యశ్రీ, ప్రమోద్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కొంగరకలాన్‌లో పరీక్షలు చేస్తున్న ఆస్పత్రి వైద్యులు

10న మాదిగల ఆత్మీయ సమ్మేళనం



అభివాదం చేస్తున్న మాదిగ సంఘం నాయకులు

తుర్కయంజాల్: ఈ నెల 10న ఇబ్రహీంపట్నంలో నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని నియోజకవర్గ మాదిగ జేఏసీ నాయకులు బోసుపల్లి ప్రతాప్, ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు రావుగళ్ల బాబులు కోరారు. ఆదివారం పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్న ఉద్యమం తుది దశకు చేరుకున్న సమయంలో మాల సామాజిక వర్గం నేతలు అడ్డుకోవడం బాధాకరమన్నారు. ఈ విషయంలో ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా తాము ఐక్యంగా ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన రోజే అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగ నోటిఫికేషన్లను ఏబీసీడీ వర్గీకరణ చేసిన తరువాతే ఇస్తామని చెప్పి, మాట తప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వర్గీకరణ చేయాలని కోరారు. 10న ఇబ్రహీంపట్నంలో నిర్వహించనున్న కార్యక్రమానికి మంద కృష్ణ మాదిగ, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ కాశీం తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బచ్చిగళ్ల రమేశ్, మల్లెల ఉపేందర్, బాల్‌రాజ్, అర్జున్, బాలకిషన్, రఘు, రమేశ్, అశోక్, యాదయ్య, కుమార్, జగదీశ్, వద్దిగళ్ల బాబు, సతీశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టాలి

ఆమనగల్లు: స్థానికత ఆధారంగా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జేఏసీ అధ్యక్షుడు మల్లేశ్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జీఓ నంబర్ 317 బాధిత ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు మల్లేశ్ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ నంబర్ 317 స్థానికత సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, నేడు సమస్యను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేయడానికి ఏర్పాటు చేసిన సబ్‌కమిటీ నివేదికలో స్థానికత అంశం లేకపోవడం, సబ్‌కమిటీ సిఫారసుల ఆధారంగా కమిటీకి సంబంధం లేని స్పౌజ్, మ్యుచువల్, మెడికల్‌కు సంబంధించిన జీఓలు విడుదల చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, అలివేలు, కల్పన, శ్రీను, చంద్రశేఖర్, నర్సింహ, పత్య, రాములు, రవి తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

సీపీఎం మండల కార్యదర్శిగా రావుల జంగయ్య



రావుల జంగయ్య

మంచాల: సీపీఎం మండల కార్యదర్శిగా చిత్తాపూర్ గ్రామానికి చెందిన రావుల జంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మంచాల మండలంలోని లోయపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఎం మండల మహాసభల సందర్భంగా నూతన కార్యదర్శిగా ఆయనను పార్టీ నాయకులు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నెరవేర్చుతానని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



దాతను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆమనగల్లు: పట్టణ సమీపంలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉప్పల ఆనంద్‌యాదవ్ రూ.26 వేలు విరాళంగా అందజేశారు. ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో దాత ఆనంద్ యాదవ్, అనూష దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉప్పల రాములు, చెర్కు వెంకటయ్య, పరమేశ్‌గౌడ్, ఆంజనేయులుయాదవ్, రవీందర్, కొండల్, రామచంద్రయ్య, కృష్ణ, నర్సింహా, తిరుపతి, మహేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల మల్లేశ్ మృతి పార్టీకి తీరని లోటు

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య

తుర్కయంజాల్: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బాల మల్లేశ్ ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం తుర్కయంజాల్ చౌరస్తాలో బాల మల్లేశ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర సహాయ కార్యదర్శి స్థాయికి ఎదిగారని, ఆయన జీవితం పేదల పక్షాన పోరాటాలకే కెటాయించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కొండిగారి శివ కుమార్, అల్లీ ముద్దీన్, ఈదుల కంటి అనురాధ, వట్టి విజయ, సుందరమ్మ, శ్రీకాంత్, శ్రీనివాస్, యాదయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



బాలమల్లేశ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మాలల సింహగర్జన ర్యాలీ



యాచారంలో సింహగర్జన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆమనగల్లు: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మాలల సింహగర్జనకు ఆమనగల్లు మండలం నుంచి మాల మహానాడు నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. స్థానిక పట్టణంలోని చెన్నకేశవస్వామి దేవాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాల మహానాడు నాయకులు మాట్లాడారు. కాలె మల్లయ్య, లండం చంద్రయ్య, నర్సింహా, దేవేందర్, రమేశ్, జగన్, రాజు, చెన్నకేశవులు, వెంకటేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

యాచారం: నగరంలో నిర్వహించిన మాలల సింహగర్జన సభకు మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి మాలలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సింహగర్జన సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పెంటయ్య, శేఖర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: సికింద్రాబాద్‌కు తరలిన మాల మహానాడు నాయకులు



తలకొండపల్లి నుంచి వెళ్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల కేంద్రంతో పాటు, చుక్కాపూర్, యడవల్లి, చీపునుంతల, చంద్రధన, రాంపూర్, తదితర గ్రామాల నుంచి మాల నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో తరలివెళ్లారు. దాసరి యాదయ్య, కనక వెంకటయ్య, కంఠం శేఖరు, నరసింహ, సత్యం, గిరి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి

మంచాల: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మంచాల గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించడం వల్ల క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. ప్రతిభగల క్రీడాకారులకు ప్రభుత్వం కచ్చితంగా గుర్తిస్తుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలు, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎడ్మా నరేందర్‌రెడ్డి, ఏర్పుల సురేష్, శ్రీశైలం, శివ పాల్గొన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

నాణ్యమైన విద్యా బోధనలో రాజీ వద్దు

పీఆర్టీయూటీఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన బోధన చేపట్టే విషయంలో రాజీ పడొద్దని పీఆర్టీయూటీఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి సూచించారు. యాచారం మండల కేంద్రంలో ఆదివారం జిల్లాలోని డీఎస్సీ-2024 ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం బీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్ రెడ్డి ఆర్థిక సహకారంతో 345 మంది నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ బుక్కులను అందజేశారు. ఈ సందర్భంగా గుర్రం చెన్నకేశవరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఉత్తీర్ణతపైనే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. దీంతో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై మంచి అభిప్రాయం నెలకొంటుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై నాటి నుంచి నేటి వరకు రాజీలేని పోరాటం చేస్తూ పీఆర్టీయూటీఎస్‌కు మంచి గుర్తింపు ఉందన్నారు. అనంతరం బీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ఆర్థిక సహకారం అందించే విషయంలో సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయ వృత్తి దేవుడిచ్చిన వరమన్నారు. చక్కగా సద్వినియోగం చేసుకుంటు నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పెరి వెంకట్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, యాచారం మండల అధ్యక్ష, కార్యదర్శులు తిరుమలేష్, యాదగిరి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అండెం ప్రతాప్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చెన్నకేశవరెడ్డి తదితరులు

పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి

మంచాల: మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామంలో ఆదివారం తెలంగాణ అమర వీరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అమర వీరుల స్థూపం వద్ద ముదిరాజు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప త్యాగధనుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు సంఘం మండల అధ్యక్షుడు సత్తయ్య, నాయకులు కావలి వెంకటేశ్, సతీష్, మల్లేష్, పాండు, కృష్ణ, మారయ్య, యాదయ్య, జంగయ్య, బుగ్గ రాములు, రమేష్, గోపాల్, జంగయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కొనసాగుతున్న ప్రజాపాలన విజయోత్సవాలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రజాపాలన- విజయోత్సవాలలో భాగంగా మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచనా పోటీల్లో 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పాండు, ఉపాధ్యాయులు కృష్ణయ్య, చందర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

ఆమనగల్లు మున్సిపాలిటీలో ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలను మున్సిపల్ కమిషనర్ వసంత ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. స్థానిక పట్టణంలోని పబ్లిక్ టాయిలెట్స్‌ను శుభ్రం చేయించారు. చంద్రాయణపల్లి తండా నుంచి విఠాయిపల్లి వరకు రోడ్డును శుభ్రం చేసి రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగింపజేశారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 6వ తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులకు ఆటలు, పునరుత్పాదక ఇంధన వనరులనే అంశంపై వ్యాసరచనా పోటీలు నిర్వహించారు. తహసీల్దార్ నాగార్జున, ఎంఈఓ చాంప్లనాయక్, ఎంపీడీఓ శ్రీకాంత్‌లు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రఘు, కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ అజీం, తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంఈఓ జగదీశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీవాణి పాల్గొని ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మధుసూదన్‌చారి, ఆర్‌ఐ నిజాముద్దీన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, ఎంఈఓ పాండు



తలకొండపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీకాంత్ తదితరులు



అబ్దుల్లాపూర్‌మెట్: బహుమతి ప్రదానం చేస్తున్న తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి